శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కావలి పాలిటెక్నిక్ కళాశాలలో ధృవపత్రాల పరిశీలన ప్రారంభం



**కావలి రూరల్, మే 29 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం రుద్రకోటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పాలిసెట్-2023 వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగంగా ధృవపత్రాల పరిశీలన ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ ప్రియ తెలిపారు. మొత్తం 13 మంది విద్యార్థులు సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ చేయించుకున్నారని తెలిపారు. 9 మంది బిసి, ఇద్దరు ఓసి, ఇద్దరు ఎస్సీ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. తిరుపతి రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మలకుమార్ ప్రియ కౌన్సిలింగ్ సెంటర్‌ని సందర్శించారని తెలిపారు. జూన్ 1వ తేది నుంచి ఆప్షన్స్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు హెల్ప్‌లైన్ సెంటర్స్‌లో తమ ఆప్షన్స్‌ని ఇవ్వవచ్చునని తెలిపారు.

## పోలీసు కార్యాలయంలో స్పందన నిర్వహించిన ఎస్పీ



**నెల్లూరు(క్రైం),మే29ప్రభాతవార్త** నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిద కేసులకు సంబందించి 90 అర్జీలు ఫిర్యాదుదారులనుండి అందుకున్నారు. ఆటోలో వచ్చిన దివ్యాంగురాలని సూచిన ఎస్పీ స్వయంగా ఆయనే ఆటో వద్దకు వచ్చి ఆమె సమస్యను తెలుసుకోని తక్షణమే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.స్పందన ఫిర్యదులపై ప్రాథమిక విచారణ నిర్వహించి సివిల్ వ్యవహారాలలో సాధ్యాసాధ్యాలను వివరించి డిఎల్ఎస్ఎ వారి ఎదుట హాజరు పరచి సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాలనుండి తమ సమస్యలను ఎస్పీకి తెలుపుకునేందుకు వచ్చిన అర్జీ దారులకు ఎస్పీ బోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆడ్మిన్ హిమావతి, అడిషనల్ ఎస్పీ క్రైం,ఎస్,ఎస్‌టీ సెల్ డిఎస్పీ తదితరులున్నారు.

## జిల్లాలో 9 మంది ఎస్ఐల బదిలీలు

**నెల్లూరు(క్రైం),మే29ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న 9 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు సి.సి.ఎస్‌లో పనిచేస్తున్న ఎస్‌కె. సుభహాణీని నెల్లూరు రూరల్ స్టేషన్‌కు, నెల్లూరు రూరల్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిహెచ్ కోటి రెడ్డిని వింజమూరు స్టేషన్‌కు, వింజమూరులో పనిచేస్తున్న వై.రంగనాథ్ గౌడ్‌ను రాపూరు స్టేషన్‌కు, రాపూరులో పనిచేస్తున్న ఎన్.కాంతి కుమార్‌ను నెల్లూరు డిసిఆర్‌బికి, దుత్తలూరులో వున్న బాజిరెడ్డిని ఉలవపాడుకు, ఉలవపాడులో వున్న టి.త్యాగరాజును జిల్లా విఆర్‌కు,ఉదయగిరిలో వున్న ప్రభాకర్‌ను దుత్తలూరుకు, తోటపల్లి గూడూరులో వున్న కె.ఇంద్రసేనా రెడ్డిని ఉదయగిరికి, నెల్లూరు ట్రాఫిక్‌లో వున్న కె.కుమార్‌ను తోటపల్లి గూడూరు స్టేషన్ ఎస్‌గా బదిలీ చేస్తే ఉత్తర్వులు జారీ చేశారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆర్‌డిఓ



**ఆత్మకూరు,మే29ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అరుందతీయవాడ సచివాలయాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఎస్.కరుణకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సచివాలయంలో ప్రజలకు అందజేస్తున్న సేవలను అడిగి తెలుసుకన్నారు. అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించి నిర్వహణా తీరుపై ఆర్‌డిఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం




**నెల్లూరు మే 29, ప్రభాతవార్త-వైద్యం** మహిళల అభివృద్ధి నారా.చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, అందుకు నిదర్శనం సోమవారం నాడు రాజమహేంద్రవరంలో మహానాడు వేదికగా చంద్రబాబునాయుడు మహిళల కోసం ప్రవేశపెట్టనున్న పథకాలేనని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్.అబ్దుల్‌అజీజ్, నగర ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిలు వక్కాణించారు. సోమవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో శ్రీనివాసులురెడ్డి సతీమణి సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు ఫ్లెక్సీకి తెలుగుమహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారన్నారు. మహానాడులో 18 ఏళ్ళ నుండి 59 ఏళ్ళ వరకు ఉన్న మహిళలకు కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి నెలకు రూ.1500వందలు ఇస్తామని తెలిపారన్నారు. ఎన్నికలకు ముందు జగన్ కుటుంబంలో ఎంతమంది బిడ్డలున్నారో వారందరికీ ఏడాదికి రూ.15వేలు అందచేస్తానని మోసం చేశాడన్నారు. ఇంట్లో అందరికి విద్యను అందిచేలా చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, దీపం పథకం ద్వారా ఏడాదికి 3 ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, యువతకు 20లక్షల ఉద్యోగాలు, అన్నదాత పథకంతో రైతులకు రూ.20వేలు రైతులకు ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. ఈ పథకాలను అమలు చేయాలంటే సులభం కాదని, రాష్ట్ర ఖజానాను జగన్ ఖాళీ చేశాడని, అయితే చంద్రబాబు అనుభవంతో వీటిని అమలు చేస్తాడన్నారు. భవిష్యత్తులో మహిళల రక్షణ కోసం లా అండ్ ఆర్డర్ కొరకు పాలసీని తీసుకొస్తామన్నారు. యువశక్తి నారా.లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని, ఎక్కడ కూడా మాటల హామీలు ఇవ్వడంలేదని, శిలా శాసనాలు, శిలా ఫలకాలు రాసి హామీలు ఇస్తున్నారని, భవిష్యత్తులో మేము ఇచ్చిన హామీలు మాకు గుర్తుచేయకుండా వాటిని మేము పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాబిర్‌ఖాన్, కువ్వారపు.బాలాజీ, నారా.శ్రీనివాసులునాయుడు, మన్నెం.పెంచలనాయుడు, మామిడాల.మధు, పనబాక.భూలక్ష్మి, కొమారి.విజయ, కప్పిర.రేవతి, కమ్మ.కళ్యాణి, పొత్తూరి.శైలజ, మహేంద్రరెడ్డి భారీఎత్తున మహిళలు పాల్గొన్నారు. మొదట టీడీపీ ఎదుట బాణాసంచా భారీ పేల్చి సంబరాలు చేసుకున్నారు.

## ఉప్పలపాడులో ప్రారంభమైన లక్ష్మీనర్శింహస్వామి ఉత్సవాలు

**అనంతసాగరం,మే29ప్రభాతవార్త:** ఉప్పలపాడులో శ్రీ లక్ష్మీనర్శింహస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా గ్రామ పెద్దలు వైసిపి నాయకులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతి రెడ్డి దంపతులు సాయంత్రం గణపతి ప్రార్ధన, గణపతి పూజ ఘనంగా నిర్వహించారు.



## అలల తాకిడికి గురై బాలుడు మృతి

**బిట్రగుంట, మే 29 ప్రభాతవార్త** బోగోలు మండలం తాటిచెట్లపాళెం సమీపంలో సముద్రం వద్ద అలల తాకిడికి గురై అఖిలేష్ (13) అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడని బిట్రగుంట ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. కొడవలూరు మండలం గుండాలమ్మపాళెంకు చెందిన అఖిలేష్ కుటుంబం నెల్లూరు నగరంలో బాలాజీనగర్‌లో వుంటుంది.

జువ్వలదిన్నెలో బంధువుల వద్దకు రావడంతో తాటిచెట్లపాళెం సముద్రం అంచుల్లో నిలబడిన బాలుడు అలల తాకిడికి గురయ్యాడు. దీంతో అస్వస్థతకు గురి కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆమె తెలిపారు.

# త్వరలో జువ్వలదిన్నె షిపింగ్ హార్బర్ ప్రారంభం

**బిట్రగుంట, మే 29 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని జువ్వలదిన్నె షిపింగ్ హార్బర్ సుమారు 300 కోట్ల రూపాయలతో చేపట్టిన నిర్మాణాన్ని త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేత ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఆయన సోమవారం మండలంలోని జువ్వలదిన్నె షిపింగ్ హార్బర్ నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ యం.హరినారాయణ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో జువ్వలదిన్నె షిపింగ్ హార్బర్ పనులు చేపట్టామని 95 శాతం మేర పనులు పూర్తి కాగా మౌలిక వసతులకు సంబంధించి మరో 5 శాతం పూర్తి చేయాల్సి వుందన్నారు, ఈ పనులు పూర్తి కాగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి త్వరలో ప్రారంభిస్తారన్నారు. ఈ హార్బర్ నిర్మాణం



పూర్తయితే సుమారు 6 వేల మంది మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయన్నారు.

రాష్ట్రంలో సహజ వనరులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో 974 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంలో నాలుగు పోర్టులు, 11 షిపింగ్ హార్బర్ నిర్మాణలకు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. 2 వేల 600 కోట్లతో చేపడుతున్న రామాయపట్నం పోర్టు నిర్మాణం ఈ ఏడాది డిసెంబరు నాటికి మొదటి ఫేజ్ పూర్తవుతుందన్నారు.ఈ నిర్మాణం పూర్తయితే 25 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పథకాల కోసం వేసిన శిలాఫలకాలన్ని విమానాశ్రయం, రామయపట్నం పోర్టు, జువ్వలదిన్నె షిపింగ్ హార్బర్ సమాధి రాళ్లుగా మిగిలియన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హర్బర్ చేపట్టిన పనులు ప్రజలకు కనపడుతుందన్నారు. బకింగ్ హామ్ కెనాల్ మరమ్మతుకు అక్కడ నుండి ఆరు గ్రామాలకు షిపింగ్ హార్బర్ అప్రోచ్ రోడ్డుకు సంబంధించి కోరగా వెంటనే నిధులు మంజూరు చేస్తామని అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మంత్రుల పర్యటనలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, కావలి ఆర్డీవో శీనానాయక్, ఎపి మారిటైన్‌బోర్డు చీఫ్ ఇంజనీర్ రాజగోపాల్, జిల్లా, డివిజన్, మండల అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

# అర్జీలను కచ్చితంగా పరిష్కరించాలి

**నెల్లూరు కార్పొరేషన్,మే29,ప్రభాతవార్త** జగనన్నకు చెబుదాం(స్పందన) అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం కలెక్టరేట్లోనితిక్కన ప్రాంగణంలో ట్రైనింగ్‌కలెక్టర్ సంజన సింహ,డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, జడ్‌పిసిఈఓ చిరంజీవితో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం జరిగింది .వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు కలెక్టర్ స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



కిందస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు.ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పుడు సకాలంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చే ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి సంతృప్తికరంగా పరిష్కార మార్గం చూపించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ, ఐసిడిఎస్ పిడిలు సాంబశివారెడ్డి, సౌజన్య, రమేష్‌నాథ్,సుస్మిత,గంగాభవాని,సర్వే రికార్డుల ఏడి హనుమాన్ ప్రసాద్,జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయుఎలు,బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య,ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్,జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యతప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాలు



**అనంతసాగరం,మే29ప్రభాతవార్త:** నాణ్యతా ప్రమాణాలతో గృహ నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ డిఇ నటరాజ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సోమశిలలో నిర్మిస్తున్న జగనన్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి సొంత ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని సంకల్పించారు. అందులో భాగంగాసోమశిలలో 164మంది లబ్ధిదారులకు గాను 125మంది కాంట్రాక్టు పద్ధతి ద్వారా ఇళ్ళు నిర్మించుకుంటున్నారన్నారు. ఇళ్ళ నిర్మాణ పురోగతి ఎప్పటిప్పుడు కార్యాచరణ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఉదయ్‌భాస్కర్, ఇంజనీర్ అసిస్టెంట్ ఆనంద్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను తనిఖీ చేసిన డిఎల్‌డివో



**బిట్రగుంట, మే 29 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీలోని సచివాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను కావలి డిఎల్‌డివో కనకదుర్గాభవానీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ కార్యక్రమాలకు ఆధార్ తప్పనిసరి చేయడంతో ప్రతి ఒక్కరు ఆధార్ తీసుకునేలా అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

**ఎంపిడివోచే సచివాలయాలు తనిఖీ...** బోగోలు ఎంపిడివో శ్రీదేవి సోమవారం జువ్వలదిన్నె, ఎస్సీపాళెం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాలలో సిబ్బంది హాజరుతో పాటు వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారుల జాబితాలను నోటీసు బోర్డులో ఆమె పరిశీలించారు. అనంతరం ప్రజలకు సేవలందించేందుకు తగు ఆదేశాలు ఇచ్చారు.

# నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**నెల్లూరు కార్పొరేషన్,మే29,ప్రభాతవార్త** పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతఇన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు,సచివాలయ వెల్ఫేర్,ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వారాంతపు ప్రగతిపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్లు,వంటగది స్లాబ్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు.తరగతి గదుల రిపేర్లు,ఫర్నిచర్,ప్రహరీ గోడలు,అదనపు తరగతి గదులు,ఎలక్ట్రిఫికేషన్ పనులను సకాలంలో పూర్తి చేసేలా




అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.జగనన్న విద్యాకానుక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,మండలస్థాయి స్టాక్ పాయింట్లలో అన్ని వస్తువుల నాణ్యతను పరిశీలించి,సిఆర్‌పి,ఏపీఎంల సహకారంతో కిట్లను సిద్ధం చేయాలని సూచించారు.వచ్చిన కిట్లు ముందుగానే పరిశీలించి సిద్ధం చేసుకుని,ఏ స్కూలుకు సంబంధించిన కిట్లపై ఆ పాఠశాల పేరు మార్కుతో ముద్రించాలని,పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ప్రతిఒక్క విద్యార్థిని జగనన్న కిట్లు అందించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్,జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని,జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత,అర్డబ్ల్యుఎస్,పంచాయతీ రాజ్ ఎస్ఈలు రంగవరప్రసాద్,అశోక్‌కుమార్,ఐటిడిఎ పీఓ మందారాణి,ఏపీఈడబ్ల్యుఐడిసి ఈఈ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోండి

**నెల్లూరు కార్పొరేషన్, మే29, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నిబద్ధతతో పరిష్కారం అందించాలని,సమస్యల పునరావృత్తం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కార్యాలయంలోని ఎ.పి.జె అబ్దుల్‌కలాం సమావేశ మందిరం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను నేరుగా మాట్లాడారు.

వివిధ సమస్యలపై వచ్చిన 13ఫిర్యాదులను కమిషనర్ సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి సూచించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు.అనంతరం



ప్రజల నుంచి నేరుగా 36అర్జీలను కమిషనర్ స్వీకరించారు.అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని ఆదేశించారు.అనంతరం ప్రజలను నేరుగా 36అర్జీలను కమిషనర్ స్వీకరించారు. అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.సమస్యలు పునరావృత్తం కాకుండా నాణ్యమైన శాశ్వత పరిష్కారం అందించాలని తెలిపారు. నాడు-నేడు పనుల పురోగతిని క్రమంతప్పకుండా అధికారులు పర్యవేక్షించాలని,టిడ్కో గృహాలు,జగనన్న కాలనీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.జగనన్నకు చెబుదాం 1902, స్పందన,ఎ.పి.సేవా పోర్టల్ నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని,పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .అందుకున్న అన్ని సమస్యలకు పారదర్శకమైన పరిష్కారాన్ని,సూచించిన గడువులోపు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని కమిషనర్ కోరారు.

## సంగం మండలానికి వందల టన్నుల మాంసం వేస్టేజి

### అడ్డుకున్న గ్రామస్తులు ..కలక్టర్‌గారు ప్రజల ప్రాణాలు కాపాడండి



**సంగం మే 29 ప్రభాతవార్త** సంగం మండలంలోని చేపల గుంటలలో చేపలకు మేతలుగా వేసేందుకు టన్నుల కొద్ది వేస్టేజి (చెడిపోయిన మాంసం) నిత్యం దిగుమతి అవుతోంది. అన్నారెడ్డిపాళెం, దువ్వూ రు, మక్తాపురం, వంగల్లు తదితర గ్రామాలకు టన్నుల కొద్ది మాంసం లారీలలో వస్తోంది. దుర్గంధమైన వాసన వెదజలుతు వాహనాలలో గ్రామాలలో నుండి వెలుతుండడంతో ప్రజలు ఆ దుర్గంధమైన వాసన భరించలేక అల్లాడిపోతున్నారు. అన్నారెడ్డిపాళెం గుంటలకు వెళుతున్న వేస్టేజి లారీని అరవపాళెం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇంత జరుగుతున్నా సంగం మండలం చేపలగుంటలలో టన్నుల కొద్ది వేస్టేజి వేస్తున్నా ఫిషరీస్ డిపార్టమెంట్ సంగం మండలం వైపు చూడకుండా వుండడంపట్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. చేపల చెరువులు గ్రామాలకు సమీపంలో వేసి వుండగా రాత్రి సమయంలో పొలాలోగాలి తోలినప్పుడు ఆ వాసన గ్రామాలలోకి వస్తుండడంతో ప్రజలు ఆదుర్గంధమైన వాసన పీల్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతునా న్నరు. దీంతో ప్రజలకు జబ్బులు కూడా వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ స్పందించి సంగం మండలానికి వేస్టేజి రాకుండా చర్యలు తీసుకోవాలని సంగం మండలం ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

## కామ్రేడ్ జక్కావెంకయ్య వర్ధంతి వేడుకలు



బుచ్చి మే 29 ప్రభాతవార్త కామ్రేడ్ జక్కా వెంకయ్య 5వ వర్ధంతి వేడుకలను మండలంలోని సిపిఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన జెండాకు పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతు నిత్యం పేద ప్రజలకోసం భూ పోరాటాలు చేసి సారాఉద్యమం, లాంటి ఎన్నో పోరాటలు చేసిన పోరాటయోదుడు అని వారు కొని యాడారు. పెనుబల్లి, దామర మడుగు, జొన్నవాడ తదితర గ్రామాలలో పెద్దఎత్తున మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు, సిఐటియు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన జనసైనికులు



**అల్లూరు, మే 29 ప్రభాతవార్త** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను కించపరిచేలా ఫ్లెక్సీలు వేయడం జరిగిందని సోమవారం అల్లూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అల్లూరులో రెండు సెంటర్లలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను కించ పరిచే విధంగా ఫ్లెక్సీలు చిత్రీకరించి వేయడం జరి గిందని ఇవి జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసే విధం గా వున్నాయని వెంటనే ఫ్లెక్సీలను తొలగించాలని అల్లూరు నగర పంచాయతీ కమి షనర్ ఫణికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అల్లూరు మండల ఉపా ధ్యక్షులు పడకల నాని, ప్రధాన కార్యదర్శి చేవూరు సుబ్రమణ్యం, నాగేంద్ర, గోనుగుంట గిరిలు పాల్గొన్నారు.

## హాస్టళ్ళలో వసతులు కల్పించకపోవడం దారుణం



**కావలి, మే 29 ప్రభాతవార్త** సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించకపోవడం, హాస్టళ్లను పునరు ద్ధరించకపోవడం అత్యంత దారుణమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి దుయ్యబట్టారు. సోమవారం కావలి ఆర్డీవో వి.కె.శీనానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సాంఘిక సంక్షేమ గిరిజన హాస్టళ్ల నిర్మా ణాలకు, మరమ్మతులకు వెయ్యి కోట్ల రూపాయలతో నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిర్వహించాలని చెప్పిన ప్పటికీ ఇప్పటి వరకు ఆ ఊసే లేదన్నారు. ఎన్నికలు కూడా ఆరు నెలల్లో జరుగుతుండగా ఒక్క సాంఘిక సంక్షేమ గిరిజన హాస్టల్‌ను పునర్మింరించకపోవడం దారుణమన్నారు. 2018 నుంచి డైట్ చార్జీలు పెంచలే దన్నారు. వారికిచ్చే కొబ్బరినూనె, సబ్బుల డబ్బులు కూడా తల్లుల అకౌంట్లలో పడలేదన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వలేదన్నారు. అనేక హాస్టళ్ళకు తలుపులు, కిటికీలు, బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు, లైట్లు, ఫ్యాన్లు కూడా లేవన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో చదువు కొనసాగించలేక ఉత్తీర్ణత శాతం పడిపోయిందన్నారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు ప్రతి ఏట హాస్టళ్ళకు దూరమ వుతున్నారన్నారు. జగనన్న పాలనలో రెండు వర్గాలకు జరిగిన అన్యాయం 75 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో ఇప్పటి వరకు జరగలేదని దుయ్యబట్టారు. మంచి అధికారులను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులపై వత్తిడి తీసుకొచ్చి విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, శివయ్య, పోలయ్య, లక్ష్మినర్సు, జెడ్డా వాసు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నేత నాగరాజు రక్తదానం



**కావలి, మే 29 ప్రభాతవార్త** సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు సోమవారం కావలి రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేశారు. ఆయన పెళ్లి రోజును పురస్కరించుకొని రక్తదానం చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు పెళ్లి రోజు, పుట్టిన రోజుల ఆర్భాటాలకు పోకుండా రక్తదానం ఇచ్చి మరొకరి ప్రాణం కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. యువత రక్తదాన ఉద్యమానికి నడుంబిగించా లన్నారు. రక్తం కొరతతో ఏ ఒక్కరు మృతి చెందకూడదని అందువల్ల ప్రతి ఒక్కరు రక్తదానం చేసి రక్తం నిల్వలు పెంపొందించాలని ఆయన కోరారు.

## తాగునీటి బోరు ఏర్పాటు

ఆత్మకూరు, మే29ప్రభాతవార్త: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో స్థానిక కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం, వైసిపి నాయ కులు జీమర్‌బాషాలు సోమవారం తా గునీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నౌషాద్‌బేగం మాట్లాడుతూ ఆత్మకూరు ఎమ్మెల్యే మేక పాటి విక్రమ్‌రెడ్డి తమ వార్డు పరి ధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తేగా స్పందించిన ఎమ్మెల్యే బోరు మంజూరు చేయించారు. దీంతో సోమవారం కౌన్సిలర్ న!షాద్‌బేగం, వైసిపి నాయకులు జమీర్‌బాషాలు బోరు ఏర్పాటు చేశారు.

## జనసైనికుల మనోభావాలు దెబ్బతీసెట్లున్న ఫ్లెక్సీలు తోలగించండి



నెల్లూరు(క్రైం), మే29ప్రభాతవార్త జనసైనికుల మనోభావాలు దెబ్బతీసేటట్టు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తోలగించాల్సిందిగా సోమవారంజిల్లా ఏస్పీ డాక్టర్ కె.తిరుమళేశ్వర రెడ్డిని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్, జిల్లా లీగల్ సెల్ ఆధ్యక్షుడుచదలవాడ రాజేష్‌లు జిల్లా ఏస్పీ, రూరల్ డిఎస్పీ ని కోరారు. రాష్టంలో మహమ్మద్ బీన్ తుగ్లక్ మల్లీ పుట్టాడా అన్నట్లుగాపాలన వుందన్నారు. పాలన చూస్తుంటే పాపం పసివాడు తరాలు మారినా రాజరికం ముగిసిపోయింది అని తెలుసుకున్నట్లు లేదన్నారు. ఎదుటివారి మనోభావాలు దెబ్బతిసే విధంగా ఫ్లెక్సీలు కట్టుకుంటూ పిచ్చి చేష్టలు చేస్తున్నాడన్నారు. అధికారులు కూడా వారి నిర్ణయానికి కోమ్ముకాస్తున్నారని , ఒక అధికారి సూచ్తే ఎకంగా మనోభావ వ్యక్తికరణం ప్రజాస్వామ్యంలో ఒక భాగమని మీరు కూడా కట్టుకోండి అంటున్నారని తెలిపారు. తీరా తాము ఫ్లెక్సీలు కట్టేందుకు వెలితే మరో అధికారి వచ్చి కమిషర్ ఫర్మిషన్ తీసుకోవాలని అంటున్నాడని, కట్టిన ఫ్లెక్సీలకు పర్మిషన్ చూపమంటే చూపడంలేదని తెలిపారు. పేద ప్రజల గురించి మాట్లాడూ అర్హత జగన్ రెడ్డికి లేదని పేదల మీద ప్రేమ వుంటే ఎప్పుడో కట్టినహౌస్ ఫర్ ఆల్‌ను ఇప్పటి వరకు పేదలకు పంచలేదన్నారు. షాదీ తోపా ఇస్తామని అనేక రకమైన షరతులతో మైనారిటీలనువంచన చేస్తునరని, దళితులకు అందల్సిన లోన్లు అసలు లేవని, విచ్చలవిడిగా పేదల భూములు అక్రమిస్తూ, అక్రమంగా ఇసుక, గ్రావెల్ రవాణా చేస్తు వేల కోట్లు దోచుకుతింటున్నారని ఆరోపించారు.

## పేదల పక్షపాతి జగనన్న



**వింజమూరు, మే29ప్రభాతవార్త:** రాష్టంలోని పేదలందరి పక్షపాతి ముఖ్యమంత్రి జగనన్న అని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం నుండి ఉదయగిరి నియోజకవర్గ కేంద్రం వరకు చేపట్టిన బైక్ ర్యాలీ వింజమూరుకు వచ్చిన సందర్భంగా ముందుగా ధనుంజయరెడ్డికి వైసిపి మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి , అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి , బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, కొండపల్లి రమేష్‌చౌదరి, మండాది గోవిందరెడ్డిలు స్వాగతం పలికారు. వింజమూరులో మెట్టుకూరు ధనుంజయరెడ్డి అశేష జనసందోహం మధ్య డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దిగ్విజయంగా 4సంవత్సరాలు పదవీ కాలం పూర్తి చేసుకున్న శుభతరుణంలో అమరావతిలో 51వేల మందికి పేద అక్కచెల్లెమ్మ లకు ఇళ్ళపట్టాల పంపిణీ చేపడితే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఆప్రాంతంలో పట్టాలు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని వక్రబాషలు చెప్పినా ,సమాధులని అవహేళన చేసినా, అనేక అవరోధాలు సృష్టించినా పేదల ముఖాల్లో సంతోషాలు చూడాలనే ఉద్దేశంతో పేదల పక్షాన నిలబడి ఒక ఊరిని తలపించే విధంగా 51వేల మందికి ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఇళ్ళ నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేసిన గొప్ప నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం వింజమూరు మండలం నుండి భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలపై ధనుంజయరెడ్డితో కలసి నాయకులు నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరికిచేరుకున్నారు. వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెత్తందారుల పెత్తనం పోవాలి



**వింజమూరు, మే29ప్రభాతవార్త:** రాష్టంలో పేదలకు, పెత్తందారులకు జరిగే పెత్తందారుల పెత్తనంపోయి పేదలందరూ సంపన్నులు కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్‌కార్పోరేషన్ చైర్మెన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి పేర్కొన్నారు సోమవారం పేదలకు, పెత్తనందారులకు జరిగే సమరంలో విజయం చేకూరాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మద్ధతుగా కలిగిరి మండలం 14వ మైలు నుండి సాగిన బైక్‌ర్యాలీ వింజమూరుకు చేరుకుంది. వింజమూరులో వైఎస్‌ఆర్‌సిపి నాయకులు పల్లాల కొండారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు తాటిచెట్ల కాలేషా, వి.వెంకటసుబ్బారెడ్డిలు చిరంజీవిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. వింజమూరు బంగ్లాసెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి మెట్టుకూరు చిరంజీవిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదల పక్షాన పోరాడుతూ పెత్తనందారులనుఎదుర్కోవాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నా మన్నారు. అందులో భాగంగా అమరావతిలో 51వేల మంది పేదలకు ఇళ్ళపట్టాలు పంపిణీ చేస్తే ప్రతి పక్ష నేత పేదలను అవహేళన చేస్తూ , పేదల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేశాడన్నారు. ప్రతిపక్ష నేత పేదవాడికి వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు జగన్నకు మద్ధతుగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ప్రతిపక్ష నేతకు కళ్ళు బైర్లు కమ్మేలా చేసేందుకే నేడు పెద్ద ఎత్తున ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఒకపే దవాడినైన తనను పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్‌చైర్మెన్ గా చేయడమే జగన్న ఆత్మీయతకు నిదర్శనమన్నారు. తాను పేదలకు పెత్తనందారుల మధ్య జరిగే యుద్ధానికి బయలుదేరిన సమయంలో అడుగడుగునా ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు .జిల్లా పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన 2024లోకూడా జిల్లాలో వైసిపి విజయఢంకా మ్రోగిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో గోపిరెడ్డి రమణారెడ్డి, మద్దిరెడ్డి వీరారెడ్డి, బుక్కాపురం సర్పంచ్ రసూల్, ఉపసర్పంచ్ రమణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కరీం తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో వైఎస్‌ఆర్‌సిపి బైక్‌ర్యాలీ



**ఆత్మకూరు, మే29ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ఉన్న తా శయంతో పేదలందరికీ ఇళ్ళ స్థలాలు అం దించాలన్న సంక ల్పంతో చేస్తున్న కార్యక్ర మాలను మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 4సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వ హిం చారు . ఆత్మకూరు శాసన సభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యా లయం నుండి సత్రం సెంటర్, హిల్‌రోడ్డుమీదుగా బిఎస్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. ఈ సంద ర్భంగా పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి , మాజీ జడ్పీటిసి సభ్యులు డాక్టర్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్‌చైర్మెన్ డాక్టర్ కోడూరు శ్రావణ్‌కుమార్‌రెడ్డి లు మాట్లాడుతూ ముఖ్య మంత్రి ఎంతో ఉన్నతాశయంతో పేదప్రజలందరికీ ఇళ్ళ స్థలాలు అందించాలనే ధృఢసంకల్పంతోముందుకు పోతున్నాంన్నారు. పేదలకు అందిస్తున్న ఇళ్ళ స్థలాలను స్మశాన వాటికతో పోలుస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడడాన్ని వారు ఈసందర్భగా తీవ్రంగా ఖండించారు. 40ఏళ్ళ రాజకీయాల్లో కొనసాగుతున్న చంద్రబాబు నాయుడు అనైతికంగా, అనాగరికంగా మాట్లాడడం శోచనీయమన్నారు. రానున్న రోజుల్లో పేద ప్రజలు చంద్రబాబు కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి 4సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వైసిపి శ్రేణులంతా జగ న్మోహన్‌రెడ్డి వెంటే నడుస్తామని , ఆయనకు అండదండగా ఉండాలనే ఉద్దేశంతో అండదండ అనే నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేశారు. 2024 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని వారు పిలు పునిచ్చారు. పట్టణంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ తహసిల్దార్‌గా టి.ప్రదీప్



అనంతసాగరం, మే29 ప్రభాత వార్త: అనంతసాగరంలోని తహ సిల్దాం కార్యాలయంలో తహసి ల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నదాత వెంకటరమణరావ్ ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. డిప్యూటీ తహ సిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.ప్రదీప్‌ను ఇన్‌చార్జ్ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.ప్రదీప్‌ను ఇన్‌చార్జ్ గా తహసిల్దార్‌గా నియమించారు. జిల్లా ఉన్నతాధికారులు సోమవారం టి.ప్రదీప్ ఇన్‌చార్జ్ తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్పందన కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. అనంతరం విఆర్‌ఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

## సిసి డ్రైయిన్‌లకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ, మే29, ప్రభాతవార్త నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూ రల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సూచ నలతో 23వ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లో కార్పొరేటర్ దుద్దగుంట శ్రీనివాసులురెడ్డి(ఒరిస్సా)సిసి డ్రైయిన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసు లురెడ్డి మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా ఈ ప్రాంతంలో సైడు కాలువలు లేని కారణంగా డ్రైనేజ్ నీళ్ళు పోక ఇబ్బందులు పడుతున్నటు స్థానికులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. శాశ్వత పరిష్కారం కోసం ఎంపీ దాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసామన్నారు. డివిజన్లో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ ఇన్చార్జి పాతపాటి పుల్లారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు, సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవిరెడ్డి బైక్ ర్యాలీకి తరలిన జనం



**జలదంకి, మే29, ప్రభాతవార్త:** వైకాపనేత, రాష్ట్ర పోలీస్‌హౌసింగ్‌బోర్డు చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి సోమవారం చేపట్టిన జయహో జగనన్న బైక్‌ర్యాలిలో జలదంకి మండలంనుంచి బారీసంఖ్యలో నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. మొత్తం 17 పంచాయతీలనుంచి నేతలు, తమ అనుచరగణంతో మండలపరిధిలోని పద్నాల్గవమైలుకు చేరుకున్నారు. చిరంజీవిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి వంటి నినాదాలతో ఆప్రాంతాన్ని హోరెత్తించారు. చిరంజీవిరెడ్డితో కరచాలనంచేసి అనంతరం ర్యాలీలో పాల్గొని ఉదయగిరికి తరలారు. మండల ఉపాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, కోదండరామపురంనేత తక్కోలు నారాయణరెడ్డి, ఎల్. ఆర్.అగ్రహారానికిచెందిన యువనేత గుర్రం దనూష్, మండల చినక్రాక నేతలు వట్టికాల బాలయ్య, శివారెడ్డి, కొత్తపాళెం నేత మస్తాన్‌రెడ్డి, గట్టుపల్లి నేతలు బాబుల్‌రెడ్డి, గొట్టిపాటి ప్రసాద్ నాయుడు, బ్రాహ్మణక్రాక శ్రీధర్‌రెడ్డి, వేములపాడు సర్పంచ్ కృష్ణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ అనుచరులు తదితర నేతలు పాల్గొని తమ సంఘీబావాన్ని తెలిపారు. పేదలకు పెత్తందారులకు మద్యజరుగబోవు యుద్దానికి సంగీబ ావంగ మన జననేత జగనన్నకు తోడుగ మన ఉదయగిరి నియోజకవర్గమని చిరంజీవిరెడ్డి ప్రకటించగానే అందరు కేరింతలుకొడుతు తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు.

## చెరువుమట్టి తరలింపును అడ్డుకున్న రైతులు



**జలదంకి, మే29, ప్రభాతవార్త:** జలదంకి మండలం చోడవరం చెరుమట్టి తరలింపును గ్రామ రైతలు అడ్డుకొ న్నారు. మట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న వారు చెరువువద్దకు చేరుకున్నారు. మట్టి ఎక్కడికి తరలిస్తున్నారు అనుమతులు వున్నాయా అంటూ ప్రశ్నించారు. ఎక్కడపడితే అక్కడ మీయిష్టవచ్చిన లోతులోతీసి బారీగుంతలు పెట్టి వెళితే రేపు వర్షాకాలంలో పరిస్తితి ఏంటి పశువులు, వాటి కాపరులు, దిగితే ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు భాద్యత వహిస్తారు. మీకు అనుమతులిచ్చిన వారినే తీసుకురండి, గ్రామానికి నష్టంచేసే పనులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న నాయకులను కూడా రమ్మనండని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఎట్టిపరిస్తితులలో ఒప్పుకునేదిలేదని తెగేసిచెప్పారు. దీంతో ట్రాక్టర్లు, జె.సి.బిలు వెనుకకు మరలాయి.

## బి.జె.పి మండల కార్యవర్గ సమావేశం



**జలదంకి, మే29, ప్రభాతవార్త:** జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో సోమవారం బారతీయ జనతాపార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మారెళ్ళ బ్రహ్మారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్బంగ మారెల్ల మాట్లాడుతు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టడం జరిగిందనిఅన్నారు. మేనెల 30నుంచి జూన్30వరకు పార్టీ పరంగ చేపట్టబోయే కార్యక్రమాలను గూర్చి వివరించాడు. ప్రదానమంత్రి నరేంద్రమోడి 9వసంతాల ప్రజారంజకపాలన, రాష్ట్ర ప్రభుత్వంపై చార్జీషీటు, బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ గూర్చి వివరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు బండారు తిరుపతిరెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యులు చల్లా హనుమారెడ్డి, మండల ప్రాదానకార్యదర్శి కంచర్ల శరత్‌బాబు, లక్ష్మీనరసయ్య. రాము, యువమోర్చా రాష్ట్ర సోషల్‌మీడియా కోకన్వీనర్ వడ్డే శ్రీనాద్‌రెడ్డి, మండల యువమోర్చా అధ్యక్షుడు వంటేరు రాకేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

## జక్కాకు ఘన నివాళి



**బిట్రగుంట, మే29, ప్రభాతవార్త:** మాజీ శాసనసభ్యులు సి.పి.ఎం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ జక్కా వెంకయ్యకె బోగోలు సి.పి.ఎం నేతలు సోమవారం ఘనంగ నివా ళులర్పించారు. జక్కా వెంకయ్య 5వ వర్ధంతిని పురష్కరించుకొని మం డల సి.పి.ఎం కార్యాలయంలో ఆయన చిత్ర పాటాన్ని వుంచి పూలమాలలువేసి ఆయన చేసి నసేవలను గుర్తుకు తెచ్చుకొని కొనియాడారు .ఈసందర్బంగ మజ్జిగను పంపిణీచేశారు .ఈకార్యక్రమంలో మండల సి.పి.ఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సి.ఐ.టి.యు మండల కార్యదర్శి చల్లా నరహరి పార్టీనేతలు ఎస్.కె అన్వర్ బాష, పోట్లూరు శ్రీనివాసులు ఎన్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## కంటి అద్దాలు పంపిణి



బిట్రగుంట, మే29, ప్రభాతవార్త: బోగోలు మండలం విశ్వనాదరావుపేటలో ఇటీవల అంబేత్కర్ జయంతిని పురష్కరించుకొని జైభీమ్ అంబేత్కర్ సేవాదళ్ ఆద్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిభిరంలో వైద్యపరీక్షలు నిర్వహించిన30 మందికి కంటి అద్దాలను సోమవారం పంపిణీచేశారు. కావలి కందుకూరు హాస్పిటల్ అధినేత డాక్టర్ రామస్వామి బోగోలులోని ఐకేర్ సెంటర్ నిర్వాహకులు దాసరి సందీప్, లలితాల్యాబ్ నిర్వాహకులు పి.సుబ్బరాయుడు సహకారంతో వీటిని అందజేశారు. ఈకార్యక్రమానికి సహకరించిన అందరికి జైభీమ్ సేవాదళ్ అధ్యక్షుడు రవిచంద్ర కృతగ్నతలు తెలియజేశారు.

## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ



ఆత్మకూరు, మే29ప్రభాతవార్త ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో సోమవారం గర్భి ణీలు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం తన సొంత నిధులతో వారికి మజ్జిగ ప్యా కెట్లు, వేరుశనగ ముద్దలు అందించారు. చల్లని నీటిని ఏర్పాటు చేశారు. ఆర్ఎంఒ డాక్టర్ మునికృష ఒణ, ఎఒ డాక్టర్ సురేష్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెనుగాలి, వాన బీభత్సానికి దెబ్బతిన్నరైతాంగాన్ని ఆదుకోవాలి



**నెల్లూరు కార్పొరేషన్, మే29, ప్రభాతవార్త** కండలేరు జలాశయంకు సమీప గ్రామాలు వెంకటా పురం ,పులికల్లు, వావింటపర్తి, ఏటూరు, కండ్రిగ, గాలిపాలెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కార ణంగాతీవ్రమైన గాలి మూలంగా ఈ గ్రామాలలో వందలాది నిమ్మచెట్లు నేలకొరిగాయని వెంకటాపురం గ్రామంలో రైతులు భద్రపరుచుకున్న ధాన్యం వందపుట్ల మేర పూర్తిగా తడిచిపోయిందని నెల్లూరు జిల్లా కలెక్టర హరినారాయణన్‌కు స్పందన బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 15లక్షల విలువ చేసే రేకుల షెడ్ సైతం ధ్వంసమైందని, నిమ్మచెట్లు పూర్తిగా పడి పోవడంతో రైతాంగానికి ఆర్థిక సహాయం అందించడం కోసం ప్రత్యేక సర్వే జరపాలని అదేవిధంగా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించడంలో ధనవంతులకు స్థలాలు కేటాయించారని అర్హులైన కడు పేద వారికి ఇంటి స్థలాలు కేటాయించలేదని విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటిస్థలాల కేటాయింపులలో అన్యాయం జరిగింది. సమగ్ర విచారణ జరపాలని బిజెపి నేతలు కాస శ్రీనివాసులు, రామిశెట్టి మోహన్‌బాబును కలెక్టర్ కోరారు.

## అనారోగ్యంతోఉన్న మహిళకు 25 వేల ఆర్థిక సహాయం



**బుచ్చి మే 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని చాముండేశ్వరీ దేవస్థానం సమీపంలో అనారోగ్యంతో బాధపడుతున్న బైనా వెంకటేశ్వర్లు కుమార్తె కీర్తికి బుచ్చి దేవాంగ సంఘం వారు 25 వేల రూపాయాలు ఆమెకు నగదు అందజేశారు.ఈకార్యక్రమంలో పస్నెం సుబ్బారావు,యారసి రామారావు, తాళ్ల నరసింహస్వామి,కొలమల శ్రీనివాసులు,బైనా వెంకటశేషయ్య, దోనిపర్తి వెంకటరమణ, బైనా శ్రీనివాసులు తదితరులు అందజేశారు.

## పేద రైతులకు అండగా నిల్చిన మహనీయుడు జక్కా వెంకయ్య



**కావలి, మే 29 ప్రభాతవార్త** మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, పేద రైతుల అభ్యున్నతికి అండగా నిలబడి పోరాటాలు చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య అని పలువురు కొనియాడారు. కావలి పట్టణంలోని సిపియం కార్యాలయంలో సోమవారం జక్కా వెంకయ్య 5వ వర్ధంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపియం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చి మండలం దామరమడుగులో 1930లో జక్కా వెంకయ్య జన్మించారన్నారు. చిన్న వయసులోనే భూస్వామి విధానాలకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలబడిన పోరాటయోధుడు జక్కా వెంకయ్య అన్నారు. కూలి రేట్లు పెంపుకు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు.ఈ జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ బంజరు భూముల్ని పేదలకు పంపిణీ చేయడంలో ఆయన కృషి మరవలేనిదన్నారు. చెరువు లోతట్టు భూముల్ని సాగు చేసుకుంటున్న పేద రైతులకు అండగా నిలిచారన్నారు. జిల్లా ప్రజలకు సాగునీరు, తాగునీరు, పంటల గిట్టుబాటు ధర కోసం ఎన్నో పోరాటాలు నడిపి పరిష్కారం చూపిన మహనీయుడు అని ఆయన కొనియాడారు. ఈ జిల్లాలో మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, ఉద్యమాలకు ఎంతగానో పాటుపడ్డారన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడి వారిలో మనోధైర్యాన్ని నింపి ప్రజా సమస్యల పోరాటాల వైపు నడిపించారన్నారు.మార్క్సిస్టు పార్టీలో అనేక బాధ్యతలు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయనను అన్ని పార్టీల నేతలు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. ఆయన లేని లోటు తీరదన్నారు. జక్కా వెంకన్న ఆశయాల బాటలో పయనిస్తూ పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. సిపియం నాయకులు బి.కృష్ణయ్య, ఇ.బాబురావు, ఎస్.కె. అమీర్‌బాషా, కె.వెంకటరత్నం, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీదారులకు మజ్జిగ, ఆహార పొట్లాలు పంపిణీ



**కావలి, మే 29 ప్రభాతవార్త** ప్రతి సోమవారం జరిగే స్పందనకు వచ్చే అర్జీదారుల ఆకలి తీర్చడంలో కావలి ఆర్డీవో శీనానాయక్ చూపిన చొరవ ఎంతైనా ప్రశంసనీయమని కావలి పట్టణ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు ఎస్.కె.ఖాదర్‌బాషా తెలిపారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉప తహశీల్దార్ మొగల్ సిరాజ్‌బేగ్ సహకారంతో మజ్జిగ, అన్నవరం శ్రీనివాసరావు సేవా సంస్థ నిర్వాహకులు హనుమకుమార్ దాతృత్వంతో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా పాల్గొని ఆర్డీవో, రెడ్‌క్రాస్ బాధ్యులు, దాతల్ని అభినందించారు. విశ్రాంత ఉప తహశీల్దార్ మొగల్ సిరాజ్ మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకొని అర్జీదారులకు దాహం తీర్చడంతో పాటు ఆహార పొట్లాల పంపిణీలో పాల్గొనడం ఎంతో ఆనందంగా వుందన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్ మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్డీవో శీనానాయక్ ఆధ్వర్యంలో రూపొందించిన వీడియో సందేశాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా దాదాపు లక్ష మందికి చేరవేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులు చెన్నంశెట్టి దినేష్, రెడ్‌క్రాస్ మేనేజర్ బి.ఎస్.ప్రసాద్, సభ్యులు పుష్యమిత్ర, రక్త కేంద్రం సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, వల్లూరమ్మ, బాలకోటయ్య, నచికేత్,వెంకటేశ్వరరెడ్డి, హనిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం



**కావలి, మే 29 ప్రభాతవార్త** కావలి-తెట్టు రైల్వే స్టేషన్ల మధ్య దిగువ లైన్‌లో కె.యం.నెం.226/8-10 పోస్టుల మధ్య పెంకుల ఫ్యాక్టరీ సంఘం వద్ద రైలు పట్టాలపై 30-35 సంవత్సరాల గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు కావలి జిఆర్‌పి ఎస్‌ఐ టి.అరుణకుమారి తెలిపారు. రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టమ్ కోసం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాల మార్చురి రూముకు తరలించడం జరిగిందని తెలిపారు. మృతుడు నల్లని రెండు చేతుల చొక్కా, పచ్చని లుంగీ ధరించి వున్నాడని కుడి చేతికి ఎర్రని దారం కూడా వుందని రైల్వే ఎస్‌ఐ అరుణకుమారి తెలిపారు.

## మరణించిన హోంగార్డుల కుటుంబసభ్యులకు చెక్కుల పంపిణీ



**నెల్లూరు(క్రైం),మే29 ప్రభాతవార్త** విధినిర్వహణలో మృతి చెందిన 7 మంది హోంగార్డుల కుటుంబసభ్యులతో పాటు, పదవీ విరమణ చేసిన8 మంది హోం గార్డులకు చెక్కులను జిల్లా ఏస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. గూడూరులోహోంగార్డుగా పనిచేస్తు పదవీ విరమణ చేసిన రమణమ్మకు రూ.76,225, ట్రాఫిక్ స్టేషన్ హోంగార్డు ఎస్‌కె మస్తాన్‌కురూ.76,230,నెల్లూరు సంతపేట స్టేషన్‌లోని హోంగార్డు వి.చిట్టిబాబుకు రూ77,700లు,వేదయాపాళెం స్టేషన్‌లోమహిళా హోంగార్డు సిహెచ్ మునికాంతమ్మకు రూ.77,775లు,వెల్ఫేర్ వింగ్‌లు వున్న హోంగార్డు డి.సత్యనారాయణకురూ.79,170,బాలాజీ నగర్ స్టేషన్‌లో హోంగార్డు ఎన్.వెంకట శేషయ్యకు రూ.19,850, దర్గామిట్ట స్టేషన్‌లోని హోంగార్డుటి.విజయలక్ష్మీకి రూ.21,315,కమ్యునికేషన్,కావలిలో పనిచేస్తున్న కె.వెంకటేశ్వర రావుకు రూ.21,315 చెక్కులను ఆయన ఆందజేశారు. అలాగే విదినిర్వహణలో మరణించిన హోంగార్డులు ఎస్ఆర్ పురం స్టేషన్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులుమరణించగా ఆయన బార్య ఎస్.మౌనికకు రూ.77,700లు,నవాబ్‌పేట స్టేషన్‌లో పనిచేస్తు మరణించినయం.వెంకయ్యబార్య పద్మావతికి 76,205,రాపూరు స్టేషన్‌లో పనిచేస్తూ మరణించిన జి.వెంకటరమణ బార్య మాధవీకి రూ.76,230లుబుచ్చిస్టేషన్‌లో పనిచేస్తు మరణించిన ఎస్‌కె అమీర్ బాషా బార్య కౌషర్‌కు రూ.76.675లు,సైదాపురం స్టేషన్‌లోపనిచేస్తూ మృతి చెందిన సిహెచ్ వెంకటేశ్వర రావు బార్య లక్ష్మీకి రూ.80,640లు,నవాబుపేట స్టేషన్‌లో పనిచేస్తూమరణించిన ఎస్.వాసుదేవరావు బార్య సుభాషిణికి రూ.78,435లు, బిట్రగుంట స్టేషన్‌లో పనిచేస్తే మరణించినఆర్.శ్రీనివాసులు బార్య తిరుపతమ్మకు రూ. 79,905ల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మృతుల కుటుంబాలవారు వారి పిల్లలను బాగా చదివించాలని అలాగే ప్రభుత్వం నుంది రావలసిన అన్ని సదుపాయాలను వెంటనే వచ్చేలాచూస్తామని ఏస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏస్పీతో పాటు మృతి చెందిన, పదవీ విరమణ చేసిన హోంగార్డుకుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఈవోపీఆర్డీని సన్మానించిన దొడ్డంరెడ్డి



**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నత పొందిన కల్పన సోమవారం రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువా, బొకేతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టి. పార్వతి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్‌లు ఉన్నారు.

## జలజీవన్ మిషన్ పనులు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులు మరింత వేగవంతం కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ అన్నారు. స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆయన ఐదు మండలాలకు సంబంధించిన ఏఈలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగాలన్నారు. అదేవిధంగా మంజూరైన కమ్యూనిటీ టాయిలెట్స్ పనులు కూడా వేగవంతం అయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఏఈలు జగదీష్, తదితరులు ఉన్నారు.

## సింహపురి రాజకీయ చరిత్రలో వేగుచుక్క జక్కా వెంకయ్య



**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** కోవూరులోని మైథిలి సెంటర్ ప్రాంతంలో సోమవారం మాజీ శాసన సభ్యులు, సీపీఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య ఐదవ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జె. వెంకమరాజు మాట్లాడుతూ సింహపురి రాజకీయ చరిత్రలో జక్కా వెంకయ్య ఒక వేగుచుక్క అన్నారు. జిల్లాలో కూలీ పోరాటం, భూ పోరాటం, సారా ఉద్యమం విషయంలో ఆయన ప్రత్యేకదనం చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ జి. శేషయ్య, ఎస్‌కే బబు, పి. శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రమేష్, సుబ్బారావు, విజయ్‌కుమార్, సురేంద్ర, పెద్దబ్బయ్య, జానకిరామ్, మాబాషా, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ

కోవూరు, మే 29 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు ద్వినాధం సుబ్బరామయ్య అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, ఏ. హనుమారెడ్డి, రుత్వికులు సుబ్బయ్య స్వామి, మురళీ స్వామి, భక్తులు ఉన్నారు.

## ఘనంగా జనసేన జిల్లాఅధ్యక్షుడు మనుక్రాంత్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు,మే29 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం నగరంలోని స్థానిక జిల్లా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌ను కట్‌చేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం పేద మహిళలకు వస్త్రాల పంపిణీ, నిరుపేదలకు అన్నదాన కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు తమ జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ జన్మదిన వేడుకలను పార్టీ నాయులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. అలాగే జన్మ దినోత్సవంలో పేదలకు కూడా సేవ చేయ్యాలనే ఉద్దేశ్యంతో చీరల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టామన్నారు. తమ నాయకులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, భవిష్యత్‌లో ఆయ న మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరుకున్నారు. జనసేన నాయకులు షేక్.ఆలియా, కోలా విజయలక్ష్మీ, అనుదీప్, శ్రీకాంత్, కంతర్, పవన్ యాదవ్, ఉదయ్, రాధమ్మ, షారు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

**బిట్రగుంట, మే 29 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీలోని టెంకాయచెట్లపాళెంకు చెందిన చెంచంగారి రెడ్డి(40) గత రెండు రోజుల క్రితం మోటార్‌సైకిల్‌పై వెళ్తూ గాయపడ్డట్లు బిట్రగుంట ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఆయనను కావలి నుంచి నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆమె తెలిపారు.

## అంబరాన్నంటిన గిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు మే 29, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి.గిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుక సంబరాలు నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య అంబరాన్నంటాయి. సోమవారం నెలూరు నగర, రూరల్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీఎత్తున ఉదయమే రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని గిరిధర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గిరిధర్‌రెడ్డిని భారీ గజమాల వేసి పూలకిరీటంతో ఆయనను ఘనంగా సత్కరించారు. గిరిధర్‌రెడ్డి కేకును కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి.పట్టాభిరామిరెడ్డి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన మాజీ ఛైర్మన్ అలహరి.విజయ్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ కూకటి.హరిబాబు, రజక కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య, యువజన విభాగం నేత మదన్‌మోహన్‌రెడ్డి, జయవర్ధన్, మాలేపాటి.చైతన్య, హరజరత్‌నాయుడు, నావూరు.శైలేంద్రబాబు, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన మాజీ ఛైర్మన్ సురేంద్ర ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. నగరంలో పలుచోట్ల ఆయన జన్మదినం సందర్భంగా అభిమానులు, నాయకులు చలివేంద్రాలను ఏర్పాటుచేశారు.

## బిఈఎస్ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం



**నెల్లూరు,మే29 ప్రభాతవార్త-విద్య** భార్గవ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్(బిఈఎస్) ప్రదమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని స్థానిక ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండి భార్గవ్‌రామ్ మాట్లాడుతు తమ సంస్థను స్థాపించిన ఏడాది కాలంలోనే విశేష ఆదరణ పొందటం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది కాలంలో సుమారు 500మందికి పైగా విద్యార్థులకు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల్లోని ప్రముఖ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించటం జరిగిందన్నారు. టెక్ మహీంద్రాలోనే 120 ప్లేస్ మెంట్స్ ఇప్పించామని తెలిపారు. రానున్న ఏడాదిలో 1000 ఉద్యోగాల కల్పనే ద్యేయంగా పనిచేస్తున్నామని అందరూ తమను ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, ఫణి పూజిత్, శభ్యాజ్, దివ్యా, సుహరిక, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ రిలే దీక్షలు



**రాపూరు,మే29ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వంలోని ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక,ఫెన్స నర్,కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలుపరిష్కరించాలంటూ సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాపూరు రెవెన్యూ కార్యలయం ఎదుటరిలే నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మే నెల 22 వ తారీఖు నుండి అక్టోబర్ 30 వ తేది వరకు దశల వారిగా ఆందోళన కార్యక్రమాలునిర్వహించాలని సంఘ జనరల్ బాడీ సమావేశంలో తీర్మాణం మేరకు తమ సంఘం రాష్ట నాయకత్వం రాష్ట ప్రభుత్వప్రధాన కార్యదర్శికి మే నెల 5వ తేది సమ్మె నోటీసు ఇచ్చారన్నారు. ఈ మేరకు దశల వారిగా ఆందోళనల రూపకల్పనలోబాగంగా తమ జిల్లా సంఘం ఆదేశాల మేరకు రాపూరు తాలుకాలో తహశిల్దార్ కార్యలయం ఎదుల 80 మందిఉద్యోగులతో ఈ రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సంఘం ఆంధోళనకు స్పందించి సంఘం ప్రభుత్వానికి సమర్పించిన 160 డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలన్నారు. లేని ఎడల ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ దీక్షలలో పెద్ద ఎత్తున ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక,ఫెన్సన్,కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. ఆందోళనలో ప్రధానంగా సి.పి.ఎస్‌ను రద్దు పరిచిఒ.పి.ఎస్‌ను పునరుద్దరించాలని నవంబరు 23 1993కు ముందు నియమితులైన ఎన్.ఎమ్.ఆర్,కంటింజెంట్ ఉద్యోగులు,డి.ఎస్.సీ ద్వారా నియామకం పొందిన కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని,పెండింగ్‌లో వున్నడి.ఎ లను తక్షణం విడుదల చేయాలని, పి.ఆర్.సి కమీషన్‌తో సంభందం లేకుండా నేరుగా ఉద్యోగ సంఘాలతోచర్చించి మెరుగైన పిఆర్‌సీని ప్రకటించాలని, డి.ఎ అరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని,జి.పి.ఎఫ్, ఎ.పి.జి.ఎల్‌లో దాచుకున్న సొమ్ముకు భద్రత కల్పించాలని,ఎఫ్.ఆర్.ఎస్. హాజరు విధానాన్ని తోలగించాల ని,అవసరమైనప్పుడుతక్షణమే రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయులురాష్ట కార్యదర్శి జి. శ్రీనివాసుల రెడ్డి,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. మునిరెడ్డి, వెంకటగిరి ఆధ్యక్ష,కార్యదర్శిలు సిహెచ్‌క్రిష్టా రెడ్డి, బి.నాగరాజు, రాపూరు ఆధ్యక్షులు జి.ఎస్ కోండా రెడ్డి, రాపూరు కోశాధికారి కలిమిలి వాసుదేవ రావు, ఉపాధ్యాక్షుడుజి.లింగమూర్తి, నాయకులు పి.సాయికుమార్ రెడ్డి,టైం స్కేల్ ఆధ్యక్షుడు కె.వి రమణ ప్రసాద్, కె.సి క్రిష్ణయ్య,పెద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

## గిరిధర్‌రెడ్డిని సన్మానించిన శశిధర్



నెల్లూరు మే 29, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు రూరల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి.గిరిధర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ 36వ డివిజను ఇన్‌చార్జ్ బాపనపల్లి.శశిధర్ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గిరిధర్‌రెడ్డితో కేకు కట్ చేయించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ డివిజను నాయకులు నందిమండలం.పుల్లమ్రాజు, ఇండ్ల.షన్ముకేస్వరరావు, చెంగల్పట్టు.సుబ్బయ్య, పసుపులేటి.హరీష్, కలగంద.అనిల్, చేరుకూరు.జగదీష్, పిల్లిల.శ్రీనివాసులు, తంజావూరు.మల్లిఖార్జున, నగరి.శేఖర్, సుజన్, ఎన్.ఇజ్రాయెల్, గోపి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కలిగిరిలో ధనుంజయరెడ్డి బైక్‌ర్యాలీ



కలిగిరి,మే29, ప్రభాతవార్త; వైసిపి ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెటుకూరి ధనుంజరెడ్డి సోమవారం కలిగిరి మండలంలో బైక్‌ర్యాలీ చేపట్టారు.కలిగిరి తాసిల్దారు కార్యాలయంనుండి మొదలైన బైక్‌ర్యాలీ ఉదయగిరి వరకు చేపట్టారు. ఈసందర్భంగా ముందుగా కలిగిరిలోని తిప్పవద్ద వెలసి ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహంవద్ద పూజల్లో పాలొన్న ధనుంజయరెడ్డి అనంతరం వైయస్ విగ్రహానికి పూలమాలు వేసి అంజలి ఘటించారు. అనంతరం బైక్‌ర్యాలీ ప్రారంబించారు. ఈసందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహనర్రెడ్డి ప్రజల పక్షపాతి, పేదల పక్షపాది అన్నారు. అందుకే ప్రజలుకూడా మానమ్మకం నువ్వే జగనన్నా అంటూజగన్మోహన్‌రెడ్డి పక్షాన నిలుస్తున్నారన్నారు. కలిగిరి జడ్పీటీసి పాలూరు మాల్యాద్రిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలోనాయకులు,రాఘవరెడ్డి , ముస్తాపురం వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో పోటీ తత్వం పెరగాలి



రాపూరు,మే29ప్రభాతవార్త విద్యార్థులలో పోటీ తత్వం పెరగాలని రాపూరు గ్రంధాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. వేసవి శిక్షణా తంగతులలో బాగంగా సోమవారం గ్రంధాలయానికి వచ్చిన విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ గొప్ప,గొప్ప, పరిశోధకలు,మేదావులు చరిత్రకు సంబందించిన గ్రంధాలు చదివినప్పుడు వారికి ధీటుగా మనం కూడా ఎదన్నా సాధించాలనేపోటీ తత్వం పెరిగితే చదువులలో మంచి పలితాలు సాధించవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరు పోటీ తత్వాన్ని ఆలవరచుకున్నప్పుడేమంచి పలితాలను సాధించవచ్చని తెలి పారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు, విద్దార్దులు వున్నారు.

## ఉదయగిరిలో బైక్ ర్యాలీ



**ఉదయగిరి మే 29 ప్రభాతవార్త** మెట్టుకూరు ధనుంజయరెడ్డి,,,,,, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి ఇద్దరు పోటా పోటీగా బైకు ర్యాలీలు నిర్వహించి ఒకర్ని ఒకరు ఆలింగనం చేసుకొని అభిమానులలో జోష్ నింపారు. ఉదయగిరి మండలంలోని ఆనకట్ట దగ్గర ఉన్న వైఎస్ విగ్రహం వద్ద నుండి బస్టాండ్ సెంటర్,కాలేజి దేవాలయాలగడ్డ మీదుగా మెట్టుకూరి చిరంజీవిరెడ్డి బైకు ర్యాలీని నిర్వహిం చా రు.ఆయన తోపాటు మెట్టుకూరి ధనుంజయరెడ్డి తన అనుచరులతో బైకు ర్యాలి నిర్వహించారు.ఇరువురు నేతలు తమ వర్గీయులతో కలిగిరి నుండి ఉదయగిరి వరకు బైకు ర్యాలీ నిర వ్వహించి జగన్ నామస్మరణతో హోరెత్తించారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవినరెడ్డి,మరొకరు ఉద యగిరి పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఇద్దరు ఒకే పార్టీకి చెందిన వారు కావడం విశేషం.ఈ సంద ర్భంగా చిరంజీవిరెడ్డి మాట్లాడుతు పేద వారు పట్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపారమైన అభిమానం ప్రేమ ఉందని అందుకు నిదర్శనమే నేనే అని చిరంజీవిరెడ్డి అన్నారు. పేదవాడినైన నాకు ఉన్నత పదవులు లబించాయంటే అందుకు కారణం ముఖ్యమం త్రేనని అన్నారు. ప్రాణం ఉన్నంత వరకు జగన్ వెంటే నడుస్తు న్నానని ఆయన ఏ పదవి ఇచ్చిన ఆపదవికి పూర్తి స్ధాయిలో న్యాయం చేస్తానని అన్నారు. నన్ను నమ్ముకున్న నియోజకవర్గ ప్రజలకు అనుచరులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. మెట్టుకూరు దనుంజయరెడ్డి మాట్లాడుతు ప్రజలు విశ్వాసం కలిగించే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని అన్నారు.ఆయన ప్రవేశపెట్టి పథకాలు ప్రతి ఇంటికి చేరాయని అన్నారు.ఉదయగిరి టికెట్ ఎవ్వరికి ఇచ్చి న అందరం కలిసి కట్టుగా అభ్యర్ది విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సుమారు 7 వందల బైకులతో ర్యాలీ నిర్వహించి ఉదయగిరి పట్టణమంతా వైఎస్‌ఆర్‌సిపి జెండాలతో రెపరెపలా డిం చారు.ఈకార్యక్రమంలో సీతారామపురం,వరికుంటపాడు,దుత్తలూరు,వింజమూరు మండలాలనుండి వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు.

## చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** అంగ న్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చి న్నారుల ఆరోగ్యం పట్ల అంగ న్‌వాడీ కార్య కర్తలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇన మడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవిబాబుతెలిపారు. కోవూరులోని 5 వసచివాలయం పరిధిలో సోమవారం ఫ్యా మిటీ ఫిజీషియన్ కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భ వతులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీన త లేకుండా దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని, దీని ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారు మందుల విషయంలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## పదోన్నతి పొందిన ఎంపీడీవోకు సన్మానం



**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న కల్పనకు ఎంపీడీవోగా పదోన్నతి సందర్భంగా సోమవారం కోవూరు జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ పార్వతి, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత టి. చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు టి. వేణు, తదితరులు కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

## నేడు విఆర్‌సి గ్రౌండ్స్‌లో మహిళలకు స్లోబైక్ రేస్-2023



**నెల్లూరు,మే29 ప్రభాతవార్త-విద్య** సరయు హీరో షోరూం, నెల్లూరుజిల్లా అర్బన్ అర్యవైశ్యసంఘం మహిళా విభాగంల సంయుక్త ఆధ్వర్యంలో నేడు నగరంలోని స్ధానిక విఆర్‌సి గ్రౌండ్స్‌లో మహిళలకు స్లోబైక్ రేస్-2023 ని నిర్వహించనున్నామని మహిళా విభాగం అధ్యక్షులు గుండ్లపల్లి పద్మప్రియ, సరయు హీరో అధినేత సరయు రాజ్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం నగరంలోని ఆర్యవైశ్యభవన లో నిర్వహించిన విలేక రుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మహిళలకు వినోదాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో సమ్మర్ స్పెషల్‌లో బాగంగా ఈ రేసింగ్‌ను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా ఎల్‌ఈడి టీవీ, ద్వితీయ బహుమతిగా ఫ్రిడ్జ్,ద్వితీయ బహుమతిగా వాషింగ్ మెషిన్ అందజేయ నున్నామన్నారు. అలాగే 5మంది విజేతలకు కన్సోలేషన్ బహుమతులుగా ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్‌ను అందజే యనున్నామని పేర్కొన్నారు.ఈ పోటీల్లో పాల్గొనే మహిళలకు ఎటువంటి ఎంట్రీ ఫీజులను వసూళ్ల చేయటం లేదని, పోటీల్లో పాల్గొన దలచిన వారు వారి వారి మోటార్‌సైకిళ్లను వారే తెచ్చుకోవాల్సి ఉంటుందని పేరొ ్కన్నారు. మహిళా విభాగం కార్యదర్శి వాయుగుండ్ల సుప్రియ,కోశాధికారి చిన్ని పద్మజ లు మాట్లాడుతు నేడు మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ పోటీలను ప్రారంబించటం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పుర ప్రముఖులు ముఖ్యఅతిధులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. జిల్లా నలుమూ లలనుండి ఇప్పటికే 400మందికిపైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు వారి వారి పేర్లను నమెదు చేసుకోవటం జరిగిందన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే మహిళలకు ఇటువంటి పోటీలు నిర్వహించటం ద్వారా కొద్దిమేర విశ్రాంతి లబిస్తుందన్నారు. పోటీల్లో గెలుపోటములు సర్వసాధారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలన్నారు. మహిళల కోసం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో అన్నీ వర్గాల మహిళలు పాల్గొని విజయవంతం చేయ్యాలని వారు కోరారు.అనంతరం స్లోరేసింగ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు, షోరూం సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

## రాపూరు నూతన ఎస్ఐగా రంగనాధ్ గౌడ్



**రాపూరు,మే29ప్రభాతవార్త** రాపూరు పోలీస్ స్టేషన్ ఎస్‌గా రంగ నాధ్ గౌడ్‌ను నియమిస్తూ జిల్లా ఏస్పీ డాక్టర్ కె.తిరుమళేశ్వర రెడ్డిసోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లాలోని వింజమూరులో ఎస్ఐగా పనిచేస్తున్న రంగనాధ్ గౌడ్‌ను రాపూ రుకు నియమించి రాపూరులో పనిచేస్తున్న ఎస్ఐ కాంతి కుమా ర్‌ను నెల్లూరు లోని డిసిఆర్‌బిలో ఎస్‌గా నియమిస్తూ ఉత్తర్వు లు జారీ చేశారు. కాంతి కుమార్ సుమారు 2 సంవత్సరాలకు పైగా రాపూరు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూస్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వుంటూ కేసులను తనదైన శైలిలో పరిష్కరిస్తూ ,పెంచలకోనలోనిశ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలను రెండు పర్యాయాలు ఎటువంటి తోపులాటలు లేకుండాభందోబస్తు ఏర్పాట్లుచేసి, స్వామి భక్తులతో పాటు మండలం లో ప్రజల నుండి మంచి పేరు తెచ్చుకున్నారు. మంచి పోలీసు అధికారిగా ప్రజలలో మన్ననలు పొందారు.

## జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు జెడ్పీ విద్యార్థిని ఎంపిక




**కోవూరు, మే 29 ప్రభాతవార్త :** కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జె. పూజిత భోపాల్‌లో జూన్ 6వ తేది నుంచి 12వ తేది వరకు జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పూజిత అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ మేరకు సోమవారం పాఠశాల సమావేశ మం దిరంలో పూజితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ దేవికలు సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి 8 పథకాలు మొట్టమొదటి సారిగా జిల్లాకు సాధించా ర న్నారు. అదేవిధంగా జాతీయ స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం తమ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేసిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజ న్‌బాబురెడ్డి పాఠశాలపై ఉన్న ప్రత్యేక అభిమానంతో సుమారు లక్ష రూపాయలు విలువ చేసే బాక్సింగ్ కిట్‌ను పాఠశాలకు అందజేశారన్నారు. వారిచ్చిన స్ఫూర్తితో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పీఈటీ వెంకట సుబ్బమ్మలు కోచ్ సహకారంతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా దృష్టి సారించారని, ఇందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

## ఎఆర్‌డి బషీర్‌కు చక్రధర్‌బాబు అభినందన

**నెల్లూరు టౌన్, మే 29 ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాల సేవకులైన అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ షేక్ బషీర్ ప్రత్యేకించి గిరిజన, దళితులు, అట్టడుగు వర్గాల కోసం చేస్తున్న సేవ లను గుర్తించి అభినందనలు తెలుపుతూ ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్‌బాబు సోమవారం ఒక లేఖను పంపారు. ఆ లేఖలోని సారాంశం చక్రధర్‌బాబు మాటల్లోనే... సమాజంలో అత్యంత వెనుకబడి వున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నం దుకు హృదయపూర్వక శుభాబినందనలు. నేను నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మూడేళ్ల కాలంలో అ ట్టడుగు ప్రజల సమస్యల పరిష్కారం కోసం వీరు అనేక మార్లు చూశారు. మారుమూల గ్రామాల ఎస్సీలు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకొనేలా మీరు కృషి చేశారు. మినరల్ ఫౌండేషన్ నిధులతో (బిఎన్ఎస్ఎఫ్) ని ధులతో ఎస్టీ నివాస ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు మనం కృషి చేశాం. ఆర్థికంగా, సామా జికంగా విద్యాపరంగా చాలా వెనుకబడిన చల్లా యానాదుల సమగ్ర అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకున్నాం. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోదక చట్టం కింద బాధితులకు నష్ట పరిహారం ఇప్పించేందుకు ప్రత్యేకంగా ఉద్యో గాల కల్పనకు మీరు నిర్విరామంగా కృషి చేస్తున్న తీరు ప్రశంసనీయం. ఎస్సీ, ఎస్టీల భూములను ఆక్రమ ణదారుల చెర నుంచి విడిపించేందుకు కూడా మీరు ఎంతగానో కృషి చేశారు. నేను నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు దళితులు, అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం మీరు అనేక మార్లు కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. అవకాశం ఉన్నమేరకు పరిష్కారానికి నేను ప్రయత్నం చేశాను. నిరుపేద ఎస్టీలకు వ్యవ సాయ పట్టాలు, ఇంటి స్థలం పట్టాలు ఇప్పించాలని, మీరు అంకితభావంతో చేసిన తీరు ప్రశంసనీయం. అట్టడుగు వర్గాల వారు చైతన్యవంతులై ప్రభుత్వ సంక్షేమ పథకాలకోసం కృషి చేయడం అభినందనీయం. మీరు చేస్తున్న కృషిని అట్టడుగు వర్గాలు మరింత ప్రయోజనం పొందేలా మీలాంటి వారు కృషి చేయడం అభినందనీయం. అట్టడుగు వర్గాల ప్రగతి కోసం మీరు ఇలాగే సేవాభావంతో మరింత పేరు తెచ్చుకోవాలని మనస్ఫూర్తిగా, హృదయపూర్వకంగా శుభాబినందనలు.

## అధిష్టానం ఆదేశిస్తే పోటీచేస్తా : మెట్టుకూరు



**సీతారామపురం మే 29 ప్రభాతవార్త** వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు సోమవారం మాజీ జడ్‌పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి రాష్ట్ర బిసి కార్పోరేషన్ డైరక్టర్ పిసి అల్లూరు రాజుల నేతృత్వంలో బైకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. పిసి అల్లూరు రాజు, రామిశెట్టి తిరుపతయ్యలు వైసిపి జెండా ఊపి బైకు ర్యాలీ నిర్వహించారు. సీతారామపురం నుండి ఉదయగిరి వరకు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గోనా న్నరు. సీతారామపురం నుండి బయలు దేరి ఉదయగిరికి బైకు ర్యాలీ చేరుకున్నది. ఉదయగిరి నియోజవకర్గం వైసిపి పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి నాయ కులకు,కార్యకర్తలను ఆప్యాయంగా అహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతు పార్టీ అభిష్టానంన నాపై నమ్మకం ఉంచి నాకు సీటు ఇస్తే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా 175కి 175 సీట్లు ఖచ్చితంగా సాధిస్తామని ,ఉదయగిరి నియోజకవర్గంలో వెనుకబడిని ప్రాంతం అని రైతులకు,నిరుదో ్యగులకు ఉపాధి కల్పిస్తామని వారు హమి ఇచ్చారు.హాజరైన నాయకులకు,కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

## సచివాలయం, ఆర్‌బికె కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



**సంగం మే 29 ప్రభాతవార్త** సంగం మండలం పడమటిపాళెం గ్రామంలో ఆత్మకూరు శాసనసభ్యులు మేక పాటి విక్రమ్‌రెడ్డి నూతన సచివాలయాన్ని,ఆర్‌బికె కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకులు కోటంరెడ్డి బాల కృష్ణారెడ్డి,జడ్‌పిటిసి రావూరు లక్ష్మీ,రావుల ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. అనం తరం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతు అభివృద్ధికి నిర్వచనం చెప్పిన ఆదర్శ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. అలాగే శంకర వీరరాఘవపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార క్రమాన్ని నిర్వహించారు.ఈ సందర ్భంగా ఆయన మాట్లాడుతు చంద్రబాబు చెప్పిదొకటి చేసేది ఒకటి అని విమర్శించారు.నిన్నమొన్నటి వరకు ఉచితాలు ఇవ్వకూడదు అని చెప్పిన చంద్రబాబు మహానాడులో ప్రక టించిన మ్యానిపెస్టో జగన్‌మోహన్‌రెడ్డిని చూపి కాపికొట్టిందేనని ఆయన ఎద్దెవ చేశారు.ప్రజలందరు నిర్ణ యించుకొని వున్నారు 2024లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తద్యమని ఆయన దీమా వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, కంతాబత్తి నర ఘ నాద్‌రెడ్డి, ఎంపిడిఒ గోపి, మాజీ జడ్‌పిటిసి తుంగా ఇందూదర్‌రెడ్డి, ఆనం ప్రసాద్‌రెడ్డి , ఎం.దేవస హా యం,సొసైటీ అధ్యక్షులు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, గంగపట్నం చంద్రశేఖరయ్య ,సంగం నాయకులు కర్నా టి రవీం ద్రరెడ్డి,శివ, కొల్లి పెంచలరెడ్డి,మదన్‌మోహన్‌రెడ్డి, దువ్వూరు నాయకులు కొల్లి శ్రీదర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి,మక్తాపురం నాయకులు చెన్నూరు మోహన్‌రెడ్డి,ఫణేంద్రరెడ్డి, జెండాదిబ్బనాయకులు కరకం బాకం శంకరయ్య, మండలంలోని పలువురు వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు.

## అనుమానాస్పదంగా గిరిజన మహిళ మృతి



**రాపూరు,మే29ప్రభాతవార్త** మండలంలోని గోనుపల్లి గ్రామం వద్ద అనుమానాస్పదంగా గిరిజన మహిళ మృతి చెంది వుండటం పోలీసులుకనుగోన్నారు. గోనుపల్లి గ్రామ గిరిజన కాలనీకి చెందిన బండి అంకమ్మ(55), గోనుపల్లి నుండి పాత పెనుబర్తి గ్రామానికివెల్లే దారిలో రోడ్డు పక్కన మృతి చెంది వుండటం గుర్తించి స్ధానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రాపూరుఇన్‌చార్జ్ సిఐ రవి నాయక్,ఎస్ఐ కాంతి కుమార్‌లు సంఘటనా స్ధలానికి చేరుకోని విచారణ నిర్వహించారు. ఈ మేరకు గిరిజన మహిళ అనుమానాస్పద మృతి కింద కేసు నమొదు చేసినట్లు ఎస్ఐ కాంతి కుమార్ తెలిపారు.

## అరుణాచలం, శ్రీశైలం వెళ్లే యాత్రికులకు ఆర్టీసి ప్రత్యేక సదుపాయాలు



**కావలి, మే 29 ప్రభాతవార్త** అరుణాచలం, శ్రీశైలం తదితర పుణ్య క్షేత్రాలను దర్శించుకునే భక్తులకు, ప్రయాణికులకు కావలి ఆర్టీసి ప్ర త్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కావలి ఆర్టీసి డిపో మేనేజర్ రా పూరు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. ఎప్పటిలాగే అరుణాచలం గిరిప్రదక్షణకు వెళ్లే భక్తుల సౌకర్యార్ధం ప్ర త్యేక బస్సులోకేవలం 1400 రూపాయలు చార్జీతో రానుపోను సౌక ర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ బస్సు జూన్ 3వ తేది బయలు దేరు తుందన్నారు. రిజర్వేషన్‌ను వెంటనే చేయించుకోవాలన్నారు. అలాగే శ్రీశైలం టికెట్ రిజర్వేషన్ చేయించుకునే వారికి తిరుమల తరహాలో దర్శన టికెట్ కూడా అందజేస్తామని తెలిపారు. ప్రయాణికులు కోరితే ప్రత్యేక ప్యాకేజిలో తీర్ద యాత్రలకు ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

## నిరాహారదీక్ష శిబిరంలో సొమ్మసిల్లిన ట్రాన్స్‌కో కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి



**కావలి, మే 29 ప్రభాతవార్త** విద్యుత్ శాఖ కావలి రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ పనులు ఇవ్వనందుకు నిరసనగా ట్రాన్స్‌కో కాంట్రాక్టర్ రామిరెడ్డి కృష్ణారెడ్డి సోమవారం కావలి విద్యుత్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీక్ష చేపట్టిన కృష్ణారెడ్డిని పూలమాలలతో సత్కరించి పలువురు మద్దతు ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై కృష్ణారెడ్డి మండిపడ్డారు. ఈ రిలేనిరాహారదీక్ష శిబిరంలో ఉన్నపళంగా కృష్ణారెడ్డి సొమ్మసిల్లిపడిపోయాడు. దీంతో ఆయనను హుటాహుటిన వైద్యశాలకు తరలించారు. కావలి పట్ట ణం పాతవూరుకు చెందిన రామిరెడ్డి కృష్ణారెడ్డి కొన్ని సంవత్సరాలుగా ట్రాన్స్‌కో కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. రూరల్ సెక్షన్ పరిధిలో పనులు కట్టబెట్టలేదన్న ఆగ్రహంతో ఆయన విద్యుత్ కార్యాలయం వద్ద రిలేనిరాహారదీక్ష చేపట్టారు. వేసవి తీవ్రతకు తట్టుకోలేక షుగర్ లెవల్స్ తగ్గడంతో సొమ్మసిల్లిపడిపోయినట్లు తెలుస్తుంది.

## జనసైనికుల మనోభావాలు దెబ్బతీసేటట్లు ఏర్పరిచిన ఫ్లెక్సీలు తీయించాలి



**నెల్లూరు కార్పోరేషన్,మే29,ప్రభాతవార్త** జనసైనికుల మనోభావాలు దెబ్బతినేటట్లు ఏర్పరిచిన ఫెక్సీలు తీయించాల్సిందింగా జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు చదలవాడ రాజేష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు నగరపాలక సంస్ధ కమిషనర్ వికాస్ మర్మత్‌కి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు.కమిషనర్ సానుకూలంగా స్పందించి సచివాలయాల పరిధిలో ఉన్న ఫ్లెక్సీలు ఫోటోల తొలగింపుకై పంపవలసందింగా సచివాలయ సిబ్బందిని ఆదేశించారని తెలిపారు.వీలైనంత వరకు ఈ రోజు సాయంత్రం లోపల అన్ని ఫ్లెక్సీలు తొలగిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ్మద్ బీన్ తుగ్లక్ మళ్లీ పుట్టాడా అనిపిస్తుందన్నారు.ఈ పరిపాలన చూస్తుంటే పాపం పసివాడు తరాలు మారిపోయిన,రాజరికం ముగిసిపోయింది అని తెలిసుకోలేకపోతున్నాడని విమర్శించారు.ఆ రోజుల్లో 10మంది మంచి గుర్తించి ఆలోచించకుండా పతనం అయిపోయిన ఆ రాజు చూసి అయినా తెలుసుకోలేక పోయారని ఎద్దేవాచేశారు.తీరా కట్టడానికి పోతే మరో అధికారి వచ్చి కమిషనర్ పర్మిషన్ తీసుకున్నారని చెబుతున్నారని,కట్టినవాటికి ఎన్ని పర్మిషన్లు ఉన్నాయో చూపించలేకపోయామన్నారు.నిజంగా చిత్తశుద్ధితో పేదల మీద ప్రేమ ఉంటే ఎప్పుడో కటిన హౌస్ ఇప్పటిదా ఎందుకు పంచలేదని డిమాండ్ చేశారు.షాదీ తోఫా ఇస్తానని అనేక రకమైన షరతులు పెట్టి తోఫా ఇస్తామని షరతులు పెట్టి వందలో ఇద్దరికి కూడా రాకుండాచేశారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జనసైనికుల కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా రెజ్లర్ల అక్రమఅరెస్టుకు నిరసనగా ఆందోళన




**నెల్లూరు,మే29 ప్రభాతవార్త-విద్య** దేశరాజధాని ఢిల్లీలో తమనకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేసు న్న మహిళా రెజ్లర్లను అక్రమంగా అరెస్టుచేయటం దారుణమని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి.కొం డమ్మ పేర్కొన్నారు. మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టును నిరసిస్తూ సోమవారం నగరంలోని స్ధానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తమపై లైగింక దాడి జరిగిందని, తమకు న్యాయం చేయ్యాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్లను అరెస్టు చేయటం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన బిజేపీ ఎంపీ బ్రిడ్జిభూషన్ శరణ్‌సింగ్‌ను తక్షణం అరెస్టు చేయ్యాలని డిమాండ్ చేశారు. బిజేపీ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళా రెజ్లర్ల ఉదంతమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు.బాధితులను అరెస్టుచేయటం, నిందితులను పార్లమెంట్‌లో కూర్చోబెట్టడం ప్రజా స్వామ్యానికే మయని మచ్చ అని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే రెజ్లర్లను విడుదల చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని లేకుంటే ఆందోళన ఉదృతం చేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి జి.సునీత, స్త్రీ విముక్తి సంఘటన నగర నాయకులు భువనేశ్వరి, ముత్తు రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరపురం మున్సిపల్ హైస్కూల్‌పూర్వవిద్యార్ధుల ఆత్మీయసమావేశం



**నెల్లూరు,మే29 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్ధానిక వెంకటేశ్వరపురం మున్సిపల్ హైస్కూల్‌లో 1995-96 సంవత్సరం 10వ తరగతి చవుదుకున్న పూర్వవిద్యార్ధుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం స్ధానిక మైపాడుగేట సెంటర్‌లోని కేపిఆర్ కళ్యాణమండపంలో ఘనంగా జరుపుకున్నారు. పూర్వవిద్యార్ధులు, ఉపా ధ్యాయులు అందరూ కలిసి 27 సంవత్సరాల నాటి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందపడ్డారు. ఈ సందర్భంగా నాటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాటూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసులు, భరత్‌కృష్ణారెడ్డి, శారారుజులను విద్యార్ధులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్ధులు వారి గురువుల పట్ల ప్రేమ, అప్యాయలను చూపించటం భావి తరాలకు ఆదర్శమని, ఇంటువంటి కార్యక్రమాల నిర్వహణతో గురుశిష్యుల భందం మరింత మదురంగా ఉంటుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పూర్వవిద్యార్ధులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.